క్లుప్తంగా

రైతు ఫీల్డ్ బుక్ ఆవిష్కరణ



రైతు ఫీల్డ్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రచురించిన ఉద్యానవన పంటల పెంపకం -2024-25 ఆర్థిక సంవత్సరంలో సన్న, చిన్న కారు రైతులకు ప్రభుత్వం అందించే రాయితీ, ఆర్థిక ప్రోత్సాహంపై ప్రచురించిన రైతు ఫీల్డ్ బుక్‌ను కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆవిష్కరించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్‌పామ్ పంటకు ఉపాధిహామీ పథకం ద్వారా మొత్తం మూడేళ్లకు కలిపి రూ.55,770 ఉద్యానశాఖ ద్వారా 60 మొక్కలకు సంబంధించి ఎరువులు, మొక్కలకు కలిపి మెటీరియల్ సబ్సిడీ ద్వారా రూ.28,860 చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అరవపల్లి రాము, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

అంధ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంధ ఉపాధ్యాయుల సంఘం నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో అంధ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ (ఎన్‌ఎఫ్‌బీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఎన్‌ఎఫ్‌బీ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరు నుంచి అంధ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, అంధ ఉపాధ్యాయులకు బదిలీల్లో ప్రస్తుతం ఉన్న మినహాయింపులు కొనసాగించాలని, ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు పీ. సురేష్ బాబు అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి మాగంటి జగదీష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణా జిల్లా అధ్యక్షుడు హుసేన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు జీజీహెచ్‌లో అన్నదానం



ఏలూరు జీజీహెచ్‌లో అన్నదానం చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

ఏలూరు టౌన్: మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగులు, సహాయకులకు మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులు 250 మందికి అన్నదానం చేసినట్టు మానవత సభ్యులు మానేపల్లి రామారావు, మానేపల్లి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నిర్మల, మోహిని, మాలతీశ్వరి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యా అభివృద్ధిలో ప్రభుత్వ విద్యాసంస్థలతో పాటు ప్రైవేటు విద్యా సంస్థలు పనిచేయడమే కాక సమాజహిత కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం శుభపరిణామమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక హేలాపురి బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన అపుస్మా జిల్లా ఉపాధ్యాయ పురస్కార వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అపుస్మా జిల్లా అధ్యక్షుడు ఎం. శివకుమార్ మాట్లాడుతూ 147 మంది ఉత్తమ ఉపాధ్యాయులను గాంధీ జయంతి సందర్భంగా సత్కరించామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ, రాష్ట్ర రీజినల్ అధ్యక్షుడు జేఎస్‌పీ బాలాజీ, రాష్ట్ర నాయకులు గుణ్ణం బుల్లెబ్బాయి, ఎంఎస్ శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి ఎన్‌ఆర్‌కేపీ ప్రసాద్, కోశాధికారి కే.రామకృష్ణ, ఏలూరు జోన్ అధ్యక్షుడు కే. వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాతిపిత గాంధీజీ జీవితం ఆదర్శనీయం



ఏలూరు (టూటౌన్) : స్థానిక దొండపాడులోని పరివర్తన్ బధిరుల పాఠశాలలో గాంధీజీ జయంత్యుత్సవంలో పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : వైఎంహెచ్‌ఏ హాలులో గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అతిథులు

ఏలూరు రూరల్ : జాతిపిత మహాత్మ గాంధీ జీవితం ఆదర్శనీయమని ఏలూరు రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ బి ప్రణవి, ఏపీఓ కిషోర్, ఎంఎస్ ఆర్‌ఈసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్‌ఆర్ స్టేడియంలో

ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో గాంధీ జయంతి నిర్వహించారు. వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం అక్బర్, పత్తిపాటి విగ్నేష్.ఎన్ జగదీష్, మహిళ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కర్రీ అరుణ, మేరీ, మాణిక్యం, జల్లా వీరభద్రరావు, జంపా సూర్యనారాయణ తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన సేవలు కొనియాడారు.

పరివర్తన్ బధిరుల పాఠశాలలో..

ఏలూరు (టూటౌన్): ఏలూరు దొండపాడులో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం, పరివర్తన్ బధిరుల పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ కో -ఆర్డినేటర్ డి. శ్రీనివాస్ రెడ్డి గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీ డీ అర్ సి సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా గాంధీజీ పోరాటం

ఏలూరు (టూటౌన్): మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరడాటమే జాతిపిత మహాత్మా గాంధీకి ఇచ్చే నిజమైన నివాళులని ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు తెలిపారు. గాంధీజీ 155వ జయంత్యుత్సవాన్ని బుధవారం నిర్వహించారు. బీసీ జేఏసీ నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ మహాత్మా గాంధీ విగ్రహానికి నూలు దండ వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పి.రాజు, కంది బలివేలు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వివిధ ప్రాంతాల్లో గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరానికి చెందిన హిందూ యువజన సంఘం (వైఎంహెచ్‌ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి త్యాగాలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో సంఘ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు వేణుగోపాల్ లునాని, కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, సంఘ సహాయ కార్యదర్శి వేమా కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి కేబీ రావు, సభ్యులు మోతే శ్రీనివాస నారాయణరావు, ఆర్‌ఎస్‌ఆర్ నాగేశ్వరరావు, ఏ. పార్వతి రామచంద్రన్, గుడిపాటి లలితా శర్మ, ఎం. సూర్యనారాయణ యాదవ్, కడియం ప్రసాద్ బాబు, కూరపాటి నాగేశ్వరరావు, టీ.లోకేశ్వరరావు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఏలూరు టౌన్: గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన రెడ్‌క్రాస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సిబ్బంది

సీఆర్‌ఆర్ కళాశాలలో..

స్థానిక సీఆర్ రెడ్డి కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఏ రామరాజు మాట్లాడుతూ గాంధీ శాంతి, అహింసా మార్గాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, వైస్ ప్రిన్సిపాల్ కే.విశ్వేశ్వరరావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ రాము, ఎన్ఎస్ఎస్ 1 - 2 ప్రోగ్రాం ఆఫీసర్లు బి.శంకర్, ఎండీఎం భాషా పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో గాంధీ జయంత్యుత్సవం

ఏలూరు టౌన్: గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించాలనే గాంధీజీ కలలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అహింసా, సత్యం అనే ఆయుధాలతో దేశానికి స్వాతంత్య్రాన్ని తెచ్చిన మహనీయులు గాంధీజీ అంటూ ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ కార్యాలయం వద్ద గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ వద్ద పరసరాల పరిశుభ్రతను పాటిస్తూ ప్రాంగణంలో స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, రెడ్‌క్రాస్ సభ్యులు ఆర్ఎస్ఆర్ బుజ్జి, పాలడుగు వెంకటేశ్వరరావు ఉన్నారు.

నేటి నుంచి దేవీ నవరాత్రి మహోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరంలో శ్రీ దేవీ నవరాత్రి మహోత్సవాలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లకు బాలా త్రిపుర సుందరి, గాయత్రి దేవి, కాత్యాయని దేవి, మహాలక్ష్మీదేవి, లలితా త్రిపుర సుందరీ దేవి, మహా సరస్వతీ దేవి, రాజరాజేశ్వరీ దేవి, మహాదుర్గాదేవి, మహాకాళికా దేవిగా అలంకరించనున్నారు. స్థానిక పవర్‌పేటలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం, పవర్‌పేట వాసుదేవాలయం ప్రాంగణంలోని రాజ్యలక్ష్మీదేవి దేవస్థానం, రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాల, పత్తేబాద కనకదుర్గ ఆలయం, 12 పంపుల సెంటర్ కనకదుర్గ అమ్మవారి ఆలయం, సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, దక్షిణపు వీధిలోని బాలాత్రిపుర సుందరి దేవి ఆలయం తదితర ఆలయాల్లో దేవీ నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



ఏలూరులోని పత్తేబాద్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద దేవీనవరాత్రులకు ఏర్పాట్లు

చైల్డ్ కేర్ వసతి గృహాల్లో స్వచ్ఛతా హీ సేవ

ఏలూరు (టూటౌన్) : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం ఎదురుగా ఉన్న మెర్సీ చిల్డ్రన్ హోమ్ చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ ఆవరణలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళాభివృద్ధి, సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశానుసారం జిల్లాలో ఉన్న అన్ని చైల్డ్ కేర్ వసతి గృహాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి సూర్యచక్రవేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వసతి గృహంలోని ఆట స్థలాన్ని, మరుగుదొడ్లు, పిల్లలు పడుకునే రూమ్‌లన్నింటినీ శుభ్రం చేశారు. ఈ నెల 30వ తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ జె.దుర్గాప్రసాద్, వన్ స్టాఫ్ సెంటర్ అడ్మిన్ సీహెచ్ నిర్మల, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సిబ్బంది శ్రీకాంత్, రాజేష్, రాజకుమార్, చైల్డ్ లైన్ సిబ్బంది ధనలక్ష్మి,రాజు పాల్గొన్నారు.



మెర్సీ చిల్డ్రన్ హోమ్ చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్‌లో స్వచ్ఛతా హీ సేవలో పాల్గొన్న డీసీపీఓ, అధికారులు

పింఛన్ పథకానికి దరఖాస్తు చేసుకోండి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులైన డప్పు కళాకారులు, చర్మకారులు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పింఛన్లను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, జాతీయ మాదిగ సీనియర్ నేత, డప్పు కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షులు పాలిమేర హరికృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక గన్‌బజారులోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో హరికృష్ణ మాట్లాడారు. ప్రతి చర్మకారుడు, డప్పు కళాకారుడు ఆధార్ కార్డులు పరిశీలించుకోవాలని, ఆధార్ కార్డు ప్రకారం 40 ఏళ్లు పైబడిన చర్మకారులు, 50 ఏళ్లు దాటిన డబ్బు కళాకారులు అర్హులన్నారు. పెన్షన్ దరఖాస్తుకు కులము, ఆదాయం సర్టిఫికెట్లతో పాటు, వృత్తిపరమైన ఫొటోను జతపరిచి, ఆయా ప్రాంతాల్లో ఉన్న సచివాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అనంతరం సంఘానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, నారపాం కిషోర్, ఎర్ర సత్యానందం, చింతాటి వెంకన్న, పాలిమేర దుర్గారావు పాల్గొన్నారు.



స్థానిక గన్‌బజార్‌లో కరపత్రాలను విడుదల చేస్తున్న పాలిమేర హరికృష్ణ

సమస్యలతో మున్సిపల్ కార్మికులు సతమతం

ఏలూరు (టూటౌన్) : మున్సిపల్ వర్కర్లు సమస్యలతో సతమతమవుతున్నారని వాటి పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏలూరు నగర యూనియన్ అధ్యక్షుడు యలగాడ దుర్గారావు అధ్యక్షతన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న భజంత్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు జనరల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, మెడికల్ లీవ్ బిల్లులు చెల్లించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ బకాయిలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెలలో జిల్లా జనరల్ బాడీ ఏలూరు నగరంలో నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. యలగాడ శివకుమార్, కాకాని సుబ్బారావు, అంత రాజ్ కిరణ్, శరంశెట్టి సురేష్, అంత రాజ్ లీలా ప్రసాద్, కటారి రత్నం,పొన్నాడ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

ఏలూరు రూరల్ : ప్రణాళికల రూపకల్పనతో గ్రామాల అభివృద్ధి మరింత మెరుగవుతుందని ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక, మల్కాపురం, శ్రీపర్రు, పెద యాగనమిల్లి, కోమటిలంక తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ విజయ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు. ఇందు కోసం 2024-2025 సంవత్సరంలో చేపట్టనున్న పనులపై ప్రజలు, పెద్దలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. అధికారులు ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్) : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నగర శాఖ అధ్యక్షురాలు షేక్ పర్వీన్ బేగం డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్లపై యూటీఎఫ్ ఏలూరు నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం ముందు సత్యాగ్రహ దీక్ష చేసి వినతిపత్రాన్ని గాంధీ విగ్రహానికి సమర్పించారు. ఈ సందర్భంగా నగర ప్రధాన కార్యదర్శి రాజారావు జొన్నకూటి మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూల్లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న హెడ్మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులో అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని, మున్సిపల్ ప్రధానోపాధ్యాయుల్లో అర్హులైన వారిని ఎంఈవోలుగా నియమించాలని, జీపీఎఫ్ ఖాతాలు తెరవాలని, బదిలీలు వెంటనే చేపట్టాలని, మున్సిపల్ పాఠశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్‌ని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బీ. సుభాషిని, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తాఫా అలీ, రుద్రాక్షి రవికుమార్, జిల్లా కార్యదర్శి ఈడే శివశంకరరావు, కౌన్సిలర్ దుర్గ భవాని, జిల్లా కార్యదర్శి సుధారాణి తదితర నాయకత్వం పెద్ద ఎత్తున సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నగర శాఖ నాయకులు

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ బాట తప్పదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ బాట తప్పదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల స్పష్టం చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులు స్థానిక ఈదర సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంజుల ఏపీటీఎఫ్ దృక్పథం- పని విధానం అనే అంశంపై మాట్లాడుతూ ఏపీటీఎఫ్ సంఘం విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు- విద్యారంగంపై ప్రభావం అనే అంశంపై రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పీ. పాండురంగ వర ప్రసాద్, ఉపాధ్యాయ ఉద్యమ చరిత్ర అనే అంశంపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. భానుమూర్తి ప్రసంగించారు.ఈ అధ్యయన తరగతులకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీ. రామారావు, బీ. రెడ్డి దొర, రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, జిల్లా సబ్ కమిటీ సభ్యులు బీ.శ్యాంసుందర్, జీ. సోమేశ్వర శాస్త్రి, ఎస్.దొరబాబు, ఎస్‌జేపీ నారాయణ, కేఎస్ రమాదేవి, కేఎస్ఎస్ ప్రకాష్‌రావు, వి.గణేష్, రాష్ట్ర కౌన్సిలర్లు కె.కుటుంబరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.కే రంగావలి, మండల పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ అధ్యయన తరగతుల్లో మాట్లాడుతున్న ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

ఆయిల్‌పామ్ టన్నుకు రూ.18 వేలు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): ఆయిల్ పామ్ రైతులకు తెలంగాణలో వలే గిట్టుబాటు ధర కల్పించి టన్నుకు రూ. 18 వేలు ధర ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో ఆయిల్ పామ్ రైతుల సమస్యలపై బుధవారం ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ టన్ను గెలలకు ఇచ్చే ధర తెలంగాణ కంటే ఆంధ్రాలో తక్కువ ధర ఉండడం వల్ల మన రాష్ట్ర ఆయిల్ పామ్ రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టన్ను ఆయిల్ పామ్ గెలల ఉత్పత్తికి రైతుకు రూ.18 వేలు ఖర్చు అవుతుంటే సెప్టెంబర్‌లో టన్ను గెలలకు రూ.14,590, ఆగస్టులో రూ.13,883 మాత్రమే రైతుకు ధర వచ్చిందని చెప్పారు. అక్టోబర్‌లో తెలంగాణలో రూ. 17,040 ఆయిల్ పామ్ గెలలకు ధర ప్రకటిస్తే, ఇంతవరకు ఆంధ్రాలో ధరపై స్పష్టత లేదన్నారు. రాష్ట్రంలో 5.60 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం కాగా అత్యధికంగా సాగు విస్తీర్ణం ఏలూరు జిల్లా పరిధిలోనే ఉందన్నారు. ప్రభుత్వాలు పెదవేగిలో ఉన్న ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని నిర్వీర్యం చేసిన ఫలితంగా ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేటు (ఓ.ఈ.ఆర్) తక్కువ చూపడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ఆధునీకరించాలని కోరారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీ బకాయిలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ఆయిల్ పామ్ రైతులు రాజకీయాలకు అతీతంగా సంఘటితం కావాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

లాల్ బహదూర్‌శాస్త్రికి ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక అశోక్ నగర్‌లోని జిల్లా పార్టీ ఆఫీసులో లాల్ బహదూర్‌శాస్త్రి, గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌ఆర్ పేటలో లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహం వద్ద బీజేపీ శ్రేణులు జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు స్థానిక ఖాదీ బండార్‌లో నాయకులు ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కట్నేని కృష్ణ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కరరావు, ఏలూరు అసెంబ్లీ కన్వీనర్ గాది రాంబాబు, నాయకులు నాగం శివ, ఇలపకుర్తి రాజశేఖర్, ఇలపకుర్తి కుసుమ, అడపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని స్వచ్ఛ భారత్‌గా తీర్చిదిద్దాలి

ఏలూరు (టూటౌన్) : ప్రజలందరూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొని విజయవంతంచేసి దేశాన్ని స్వచ్ఛ భారత్‌గా తీర్చిదిద్దడమే మనమంతా మహాత్మా గాంధీజీకి అర్పించే నిజమైన నివాళులని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. గాంధీజీ జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత మేయర్ తదితరులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ ఏ.భాను ప్రతాప్, డీఈ కొండలరావు,పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కూర్మా ఆనందరావు మృతికి సంతాపం

ఏలూరు టౌన్ : ఏలూరు విద్యానగర్‌కు చెందిన కూర్మా ఆనందరావు అనారోగ్య కారణాలతో మరణించారు. ఆయన మృతికి ఏలూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ప్రగాఢ సంతాపం తెలిపారు.ఆనందరావు భౌతికకాయానికి వారు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, కార్పొరేటర్ మదిరి నిర్మల, మదిరి గ్జేవియర్, జక్కుల బెనర్జీ, జీ. రవి, మాజీ కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, స్టాన్లీ, మేతర సురేష్ తదితరులున్నారు.

ఏపీ అండర్ 19 క్రికెట్ జట్టుకు తాతా సాయి ప్రకాష్



దెందులూరు: ఏపీ అండర్ -19 క్రికెట్ జట్టుకు తెలుగు తేజం తాతా సాయి ప్రకాష్ ఎంపిక కావడం తెలుగు ప్రజలందరికీ సంతోషకరమైన విషయమని బీసీ సంఘాల నేతలు ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు పరసా లక్ష్మి సుజాత కనకరాజు, బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ తదితరులు అన్నారు. గౌడ సంఘ సభ్యుడు తాతా సాయి ప్రకాష్‌ను పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గణపవరం: పిప్పర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించే టేబుల్‌టెన్నిస్ పోటీలకు ఎంపిక య్యారు. సోమవారం భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలో పిప్పర పాఠశాలకు చెందిన అండర్-14 విభాగంలో య.వరుణ్ (7వ తరగతి), అండర్-17 విభాగంలో బి.సుధీర్ (9వ తరగతి) ఎంపికైనట్లు హెచ్ఎం జయవెంకటేశ్వరరావు తెలిపారు. వీరు నంద్యాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి టీటీ పోటీలో పాల్గొంటారని తెలిపారు.